క్లుప్తంగా

వేంకటాద్రిపై శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు తులాభారం మొక్కులు చెల్లించుకున్నారు. ప్రసాద వితరణ చేపట్టారు.

ఉపాధి హామీ పథకంలో మ్యాజిక్ డ్రైన్లు



అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణరావు

సబ్బవరం: గ్రామాల్లో ప్రజలు ముందుకు వస్తే గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మిస్తామని జెడ్పీ సీఈవో నారాయణరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమై మండలంలో పారిశుధ్య నిర్వహణపై గురువారం సమీక్షించారు. మండలంలో పారిశుధ్య నిర్వహణలో అంతకాపల్లి పంచాయతీ ముందంజలో ఉందన్నారు. బంగారమ్మపాలెంతో పాటు నారపాడు గ్రామాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ముందుగా ఆయన బంగారమ్మపాలేన్ని సందర్శించారు. గ్రామస్తులతో కాసేపు చర్చించి మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. గ్రామంలోని ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రం తీరును పరిశీలించారు. సమావేశంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పద్మజ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: ఈపీడీసీఎల్ సబ్బవరం సెక్షన్-1 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వాహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు, వ్యవసాయ విద్యుత్‌కు 24 గంటల పాటు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సబ్ స్టేషన్ పరిధి గ్రామాల ప్రజలు దీన్ని గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

ఓట్ల నమోదులో బీఎల్వోలు కీలకం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట అప్పారావు

పెందుర్తి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకునేలా బూత్ లెవల్ అధికారు(బీఎల్వో)లు తగిన అవగాహన కలిగించాలని తహసీల్దార్ ఐ.వెంకటఅప్పారావు అన్నారు. ఓట్ల నమోదుతో పాటు ఎన్నికల ప్రక్రియలో బీఎల్వోలది కీలక పాత్ర అని చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్వో యాప్, పత్రాల నిర్వహణ, ఈసీ నియమావళి అమలు వంటి అంశాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

విలువలే వ్యక్తిత్వానికి పునాది



లా వర్సిటీ మాజీ వీసీ సత్యనారాయణను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

గోపాలపట్నం: మన విలువలే వ్యక్తిత్వానికి పునాది అని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. నమ్మకాలు, విలువలే వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయన్నారు. నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ ఇన్ ఎడ్యుకేషన్ అంశంపై గురువారం ఏర్పాటు చేసిన సెమినార్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మానవతా విలువల్లేని వ్యక్తి ఆకారానికే పరిమితమవుతాడన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. అనంతరం ఆయన్ను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌రావు, కె.సత్యనారాయణ, కె.దయానా తదితరులు పాల్గొన్నారు.

వెలుగుల వెనుక బతుకు.. బితుకు



నా పేరు దాసరి పెంటయ్య. మాది గుల్లేపల్లి గ్రామం. 40 ఏళ్లుగా బాణసంచా తయారీయే వృత్తి. 15 కిలోల ముడిసరకుతో బాణసంచా తయారీ చేసుకునేందుకు మాత్రమే అనుమతులిస్తారు. నిబంధనల మేరకు జాగ్రత్తలు తీసుకుని మా కుటుంబ సభ్యులం మాత్రమే బాణసంచా తయారు చేస్తాం. మా అన్నయ్య దాసరి సత్యం, ఆయన ముగ్గురు కొడుకులతోపాటు మిగిలిన కుటుంబ సభ్యులంతా కలిసి 8 మంది భూలోకమ్మతల్లి ఫైర్ వర్క్స్ పేరుతో బాణసంచా తయారు చేసేవారు. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో అన్నయ్య, వదినలతోపాటు కుటుంబసభ్యులు, కార్మికులు ఏడుగురు ఒకేసారి చనిపోయారు. మరోసారి జరిగిన ప్రమాదంలో కూడా కొందరు మరణించారు. దీంతో చాలా మంది ఈ పనిని వదులుకున్నారు. మరో పని చేతకాక ఇంకా ఈ పనే చేస్తున్నాను.



గుల్లేపల్లిలోని బాణసంచా తయారీ కేంద్రం



మొగలిపురంలోని బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రామచంద్రరావు, తహసీల్దార్ చిన్నికృష్ణ

- ప్రమాదకర పరిస్థితుల్లో బాణసంచా తయారీ
- భయం భయంగా తయారీ కేంద్రాల నిర్వాహకులు
- అనుమతి లేని కేంద్రాలపై అధికారుల తనిఖీలు



సబ్బవరం: దీపావళి పండగ వస్తోందంటే ప్రతి ఒక్కరికీ గుర్తుకొచ్చేది బాణసంచా వెలుగులే. ఆ వెలుగుల వెనుక దాగిన బాణసంచా తయారీ కార్మికుల చీకటి బతుకులు మాత్రం ఎవరికీ తెలియవు. పనిచేస్తున్నంత వరకు క్షణక్షణం భయం భయంగా ఉండాల్సిందే. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. బతుకులు బుగ్గిపాలు కావాల్సిందే..! కొన్నిసార్లు ఎంత అప్రమత్తంగా ఉన్నా.. ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే అధికారులు బాణసంచా తయారీకి అనుమతులిచ్చేందుకు కఠినంగా వ్యవహరిస్తారు. అయినప్పటికీ మండలంలో అనధికారికంగా బాణసంచా తయారీ జరుగుతూనే ఉంది.

కోర్టునాశ్రయించి.. తయారీ

ప్రస్తుతం మండలంలోని మొగలిపురంలో దాసరి అంకుల్, గుల్లేపల్లిలోని దాసరి పెంటయ్య, మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరంలో పెద్దాడ నాగేశ్వరరావులు బాణసంచా తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించిన అనుమతులు ఇప్పటికే రద్దయినా.. హైకోర్టునాశ్రయించి బాణసంచా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు అనధికారిక తయారీ కేంద్రాల వల్లే ప్రమాదం ఎక్కువన్న భయం సర్వత్రా నెలకొంది. చాలా వరకు గుట్టుగా తయారు చేస్తుండటంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తేగానీ.. అసలు విషయం బయటకురాని పరిస్థితి.

గతంలో జరిగిన ప్రమాదాలు

- 2019లో గుల్లేపల్లిలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో 7గురు మృత్యువాత పడ్డారు.
- 2022లో ఆరిపాక శివార్లలో నిర్వహిస్తున్న బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగి ముగ్గురు మరణించగా మరొక మహిళ తీవ్రగాయాలతో బయటపడింది

అధికారుల తనిఖీలు

మండలంలో చాలా చోట్ల అనధికారిక బాణసంచా తయారీకేంద్రాలు నడుస్తున్నట్లు సమాచారం. కోర్టు ఉత్తర్వుల ద్వారా కొనసాగుతున్న తయారీ కేంద్రాల్లో కూడా భద్రతా నిబంధనలు పూర్తిగా పాటించని పరిస్థితి. నిర్వాహకులు కార్మికుల పట్ల రక్షణ చర్యలు, అగ్నిమాపక పరికరాలు నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయని పరిస్థితి. దీంతో పోలీస్‌లు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ముమ్మర తనిఖీలు మొదలెట్టారు. అనధికారిక తయారీ, నిల్వలు దొరికితే కేసులు నమోదు చేస్తున్నారు.

కఠిన చర్యలు తప్పవు



మండలంలో అనుమతుల్లేకుండా బాణసంచా తయారీ, నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతులున్న కేంద్రాల్లో సైతం నిబంధనల మేరకు అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాలి. గతంలో మండలంలో జరిగిన పలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని బాణసంచా తయారీ కేంద్రాలపై అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే మండలంలోని పలు బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేసి, నిర్వాహకులను హెచ్చరించాం.

– జి.రామచంద్రరావు, సీఐ, సబ్బవరం

టెన్త్‌లో శతశాతం ఫలితాలే లక్ష్యం

'గ్రామ సందర్శన'లో డీఈవో ప్రేమకుమార్



విద్యార్థుల ఇళ్ల వద్ద వారి అభ్యసనా సామర్థ్యం పరిశీలిస్తున్న డీఈవో ప్రేమకుమార్

సింహాచలం: వచ్చే ఏడాది పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా గ్రామ సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి చదువుతున్న పలువురు విద్యార్థుల ఇళ్లకు గురువారం సాయంత్రం ఆయన వెళ్లి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎలాంటి సందేహం ఉన్నా పాఠశాల ఉపాధ్యాయులను తల్లిదండ్రులు సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, డీసీఈబీ కార్యదర్శి కృష్ణకుమార్, సీఎంవో దేవుడుబాబు, సమగ్రశిక్ష అభియాన్ ఏపీవో అప్పలనాయుడు, చినగదిలి మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లలిత, ఉషారాణి, గీతాదేవి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెందుర్తి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో-1 కె.సువర్ణ గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లను గురువారం సందర్శించారు. ఎంఈవో-2 టి.మధుమూర్తి, హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవోలు సువర్ణ, మధుమూర్తి, హెచ్‌ఎం చిన్నమ్మాయి

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి



సుజాతనగర్ సమీపంలో స్థానికులతో మాట్లాడుతున్న జగ్గునాయుడు

పెందుర్తి: నగరంలో నిర్వహించనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. సుజాతనగర్ సమీపంలోని కార్మిక నగర్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సైతం కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. సీఐటీయూ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును దేశ, రాష్ట్ర స్థాయి నేతలు ఎండగడతారని పేర్కొన్నారు. మహాసభలో ఆఖరి రోజు లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన ఉంటుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.జగన్, జోన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావ్, నాయకులు కె.అప్పలనాయుడు, జి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం



ప్రేమ్‌కుమార్‌తో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: మానసిక వైకల్యంతో అనాథగా తిరుగుతున్న ఓ వ్యక్తికి పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. నగరంలోని హెచ్‌బీ కాలనీకి చెందిన చింతల ప్రేమ్‌కుమార్(35) చిన్ననాటి నుంచి మతిస్థిమితం లేదు. తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో అతడు అనాథగా మారాడు. ఈ క్రమంలో పెందుర్తి ప్రాంతంలో తిరుగుతున్న ప్రేమ్‌కుమార్ పరిస్థితిని స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ గమనించి, సీఐ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఐ స్వయంగా ప్రేమ్‌కుమార్ వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. అనంతరం లయోలా వృద్ధాశ్రమానికి తరలించారు.

అంగన్‌వాడీల సహకారంతో ఆరోగ్యవంతమైన సమాజం



గర్భిణీల సామూహిక సీమంతంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు



పౌష్టికాహార స్టాళ్లు పరిశీలిస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి

సబ్బవరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి అధ్యక్షతన 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సమకూరుస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సమర్థవంతంగా పంపిణీ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ప్రభుత్వం అందించిన పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ముందుగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవల గురించి సమగ్రంగా తెలిపారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాశన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, సీడీపీవో లలితకుమారి, వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి, సర్పంచ్‌లు ఎస్.నారాయణమూర్తి, ఎంపీటీసీ కర్రి అప్పారావు, నాయకులు బోకం రామునాయుడు, బోను గంగునాయుడు, గవర రాజు, పడాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పిల్లలు ఆరోగ్యంగా పుట్టాలంటే గర్భిణులు నిత్యం అందుబాటులో ఉన్న పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ మధుపాడ నాగమణి అంజి తెలిపారు. పెందుర్తి ప్రాజెక్ట్ ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం 8వ రాష్ట్రీయ పోషణ్ మా పథకం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పలు అంశాలపై సూచనలు సలహాలు అందించారు. 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. సీడీపీవో నీలవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 మధుమూర్తి, వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలపై పెరిగిన వేధింపులు



ఐద్వా మహాసభకు హాజరైన పరవాడ ప్రాంతానికి చెందిన అనకాపల్లి జిల్లా ప్రతినిధులు

పరవాడ: రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు పెరిగిపోయినా కూటమి ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని ఐద్వా అనకాపల్లి జిల్లా కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో ఇటీవల జరిగిన ఐద్వా మహాసభకు హాజరైన పరవాడ ప్రతినిధులు గురువారం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు ప్రక్రియను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పరవాడలో ఫార్మా కాలుష్యం బారిన పడుతున్న గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రణాళికబద్ధంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు



పాడిరైతులకు పశువుల మందులు అందిస్తున్న డాక్టర్ రామకృష్ణ కీర్తి

పరవాడ: మండలంలోని కలపాక పంచాయతీ స్వయంభూవరంలో పశు సంవర్ధకశాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు గణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. పరవాడ పశు సంవర్ధకశాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి ఆధ్వర్యంలో 36 పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు, 27 గేదె పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేశారు. మరో 25 పశువులకు ఇతర వ్యాధులకు సంబంధించిన వైద్యం అందించి ఉచితంగా మందులు అందించారు. పశువైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ సౌజన్య, డాక్టర్ సురేష్‌కుమార్, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం నేడు

పెదగంట్యాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పెదగంట్యాడ మండల స్థాయి క్రీడా, ఆటల పోటీలు శుక్రవారం ఉదయం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల, డివిజన్ కో ఆర్డినేటర్లు భానోజీరావు, రామచంద్రరావు తెలిపారు. అండర్ – 14, 17 (బాలురు) క్రీడా, అథ్లెటిక్స్ పోటీలు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నామని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే శనివారం బాలికలకు పోటీలు ఉంటాయని, క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులను డివిజన్ జట్లకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

ఆదర్శ్‌లో ఐవోటీ అప్లికేషన్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో కరస్పాండెంట్ థియోఫిలాస్

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎం.సాయికృష్ణ, కె.సాయిమోహిత్, జె.చందుబాబు, టి.అశ్విని విద్యార్థులకు ఆర్డినో, ర్యాస్ బెర్రీ, ఈఎస్‌పీ32పై మౌలిక పరీక్షలు చేసి విద్యార్థులకు అవగాహన కలిగించారు. పలు అంశాలపై సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, వైస్ ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు బాసటగా నిలవాలి

పెదగంట్యాడ: ప్రత్యేక అవసరాలుగల(మానసిక దివ్యాంగ) చిన్నారుల పట్ల సేవాభావంతో ఉండాలని ఎంఈవో కంకటాల రమణాజీ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో మారి ఆర్గనైజేషన్ భవిత కేంద్రానికి అందించిన వాటర్ ప్యూరిఫైర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కండిపిల్లి మేఘన అనే విద్యార్థినికి అందించిన వీల్ చైర్‌ను ఆయన విద్యార్థినికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారుల్లో ఉత్సాహం నింపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి భవిత కేంద్రంలోని చిన్నారుల సంక్షేమానికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జయభారతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనసేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు.

108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం శేషవస్త్రాలను అందించారు.

'ఇంటర్ ఉద్యోగుల సంఘ' రాష్ట్ర కార్యదర్శిగా మురళీమోహన్



మురళీమోహన్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శిరీషారాణి, సిబ్బంది

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.మురళీమోహన్ ఏపీ ఇంటర్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శిరీషారాణి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. అతి తక్కువ సమయంలో స్టేట్ సెక్రటరీగా ఎంపికవడం కళాశాలకు గర్వకారణమే కాకుండా ఇంటర్ బోర్డుకు కూడా మంచి జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎ.జనార్దనరావు, ఎం.మోహనరావు, పి.సుభాషిణి, పి.సూర్యశ్రీ, బి.గోవిందరావు, ఎస్ఎల్ఎన్‌వీ ఉదయ్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, బి.బాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.